
నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆగని సమ్మె.. సాగని చదువులు

- సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరుబాటతో స్తంభించిన విద్యావ్యవస్థ
- అయోమయంలో విద్యార్థులు

ఆసిఫాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె రోజురోజుకు తీవ్ర రూపం దాలుస్తోంది. ఉద్యోగభద్రతే లక్ష్యంగా తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని ఉద్యోగులంతా సమ్మెబాట పట్టారు. ఈనెల 6నుంచి మూడురోజుల పాటు రిలేదీక్షలు చేపట్టి ఆ తర్వాత 10వ తేదీ నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2344మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటుండడంతో కస్తూర్బా గాంధీ బాలికల చదువులపై ప్రభావం పడుతోంది. బడుల్లో పర్యవేక్షణ గాడితప్పింది. దీంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు. సమగ్రశిక్ష విభాగంలో కస్తూర్బా విద్యాలయాల బోధన సిబ్బందితోపాటు డీఈవో, ఎమ్మార్సీ కేంద్రాలలో పనిచేసే ఏపీవో, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్‌లు, సీసీవోలు, అటెండర్లు, మెసెంజర్లు, క్షేత్రస్థాయిలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు, ఐఈఆర్పీలు ఇలా వివిధ విభాగాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న 2,344 మంది ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. గత ప్రభుత్వ హయాంలో 25రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టగా ప్రతిపక్ష నేత హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగులు చేపడుతున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగభద్రతకు హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యను పరిష్కరిస్తామంటూ భరోసాను ఇచ్చారు. ఏడాది గడిచినా ఆ హామీ ఉసెత్తకపోవడంతో తిరిగి ఎస్ఎస్ఏ ఉద్యోగులు డిమాండ్లను పరిష్కరించాలని సమ్మెకు దిగారు. దీంతో కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో బోధించేవారు లేకపోవడంతో విద్యా బోధన కుంటుపడిపోతోంది. పరీక్షల సమయం సమీపిస్తుండటంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు.

నిలిచిన బోధన..

సమగ్రశిక్ష పరిధిలోకి వచ్చే కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో పనిచేస్తున్న బోధన సిబ్బంది సమ్మెబాట పట్టారు. దీంతో జిల్లాలోని 15 కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో విద్యా బోధన నిలిచిపోయింది. పదవతరగతి, ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన కీలక సమయమిది. మార్చి5 నుంచి ఇంటర్, మార్చి21 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ తరుణంలో బోధన నిలిచి పోవడంతో విద్యార్థులు తమకు తామే చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో పాఠాలు బోధించేవారు లేకపోవడంతో విద్యార్థులు, పోషకులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే విద్యార్థుల వార్షిక పరీక్షల ఫలితాలపై తీవ్రప్రభావం పడనున్నది.

కొనసాగుతున్న సమ్మె.

ఆసిఫాబాద్ రూరల్ : సమగ్ర శిక్ష ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతు న్నాయి. బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలోనే క్రిస్మస్ వేడుకలు నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు మోహన్, నాగేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్లివే..

- సర్వీసును క్రమబద్ధీకరించాలి
- తక్షణమే పేస్కేల్ వర్తింపచేయాలి
- జీవిత, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి
- ప్రభుత్వ నియామకాల్లో వేయిటేజ్ ఇవ్వాలి
- పదవీ విరమణ ప్రయోజనాల కింద రూ.25లక్షలు చెల్లించాలి

డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తాం..



- శృతిక, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు, కుమరంభీం ఆసిఫాబాద్

ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తాం. గతంలో తమ సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఏడాది పూర్తయిన ఎలాంటి స్పందనలేదు. శ్రమ దోపిడీకి గురవుతున్నాం. సర్వీసు క్రమబద్ధీకరించి ఉద్యోగభద్రత కల్పించాలి.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఆసిఫాబాద్ ఎస్ఈ ఆర్ శేషారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ ఆర్ శేషారావు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న వేసవికాలంలో మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఇప్పటికే నుంచి ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్ఈ ఆర్ శేషారావు తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో పెరిగే డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్తగా నాలుగు పవర్‌ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు, 33/11 సబ్‌స్టేషన్‌లలో 4పవర్‌ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో ఈసుగాం 132కేవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకుగాను ప్రతి టీజీఎన్‌పీడీసీఎల్ ఉద్యోగి కంకణబద్ధులై పని చేస్తున్నట్లు తెలిపారు.

జాతి ఐక్యత కోసం కృషి చేయాలి

- బంజార సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్


మాట్లాడుతున్న బంజార సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జాతి ఐక్యత కోసం అందరూ కృషిచేయాలని బంజార సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ రాములునాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా నాయకుడు అజ్మీరాశ్యాం నాయక్‌తోకలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజార భాషను కేంద్రప్రభుత్వం 8వ షెడ్యూల్‌లో చేర్చి అధికారభాషగా గుర్తించాలని అన్నారు. పార్లమెంట్‌లో బాబా లక్కీషాబంజారా ప్రతిమ ప్రతిష్ఠించాలని, బాబా మఠానికి ఉన్న భూములకు రక్షణ ఇవ్వాలన్నారు. బంజార జాతికి చెందిన వ్యక్తిని టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించాలని, రామారావు మహారాజ్‌కు భారతరత్న ఇవ్వాలని, సేవాలాల్ జయంతిని అధికారికంగా జరపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌సింగ్, విలాస్, శంకర్ నాయక్, బాబురావు, బలిరాం, శివప్రసాద్, గులాబ్, శ్యాంలాల్, ఈశ్వర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టమాట రైతుకు ధరాఘాతం

- పశువులకు మేతగా టమాటాలు


ఎడ్లకు ఆహారంగా టమాటాలు

కెరమెరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటివరకు ఆకాశాన్నంటిన టమాట ధర నేడు నేలచూపు చూస్తోంది. మండలంలోని సావర్‌ఖేడగ్రామానికి చెందిన రైతుమోతిరావు తనకున్న రెండెకరాల్లో దాదాపు రూ.70వేలు పెట్టుబడి పెట్టి టమాట సాగు చేశాడు. చేనులో టమాట సేకరించడానికి అదనంగా ఒకరికి రోజు వారీ కూలీ రూ.400 చెల్లిస్తున్నాడు. అయితే ఆసిఫాబాద్, మంచిర్యాల మార్కెట్‌లో హోల్‌సెల్‌లో 12కిలోల టమాటా బాక్స్ కేవలం రూ.300 మాత్రమే పలుకుతోందని పేర్కొన్నాడు. ఈఆదాయం చేనులో టమాటా సేకరించడానికి, మార్కెట్ తరలించడానికి పెట్టిన చార్జీలు కూడా రావడం లేదని వాపోయాడు. చేసేది లేక నాణ్యమైన టామాటాను అతికష్టం మీద మార్కెట్‌కు తరలిస్తూ మిగిలిన వాటిని తన ఎడ్లకు మేతగా వేస్తున్నాడు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక

తిర్యాణి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిర్యాణిమండల మాజీ డీసీసీ డైరెక్టర్ తోట వెంకటేశం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్‌పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, చుంచు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పెంచికలపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన సబియాకు బుధవారం బీజేపీ నాయకులు మధుకర్ సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాజన్న,నాన్నయ్య,నాగన్న,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంకర పోశారు.. తారు మరిచారు

- అధ్వానంగా రవీంద్రనగర్- బాబాపూర్ రోడ్డు


తారు వేయకుండా వదిలి వేసిన రోడ్డు

చింతలమానేపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండంలోని రవీంద్రనగర్-1 గ్రామం నుంచి బాబాపూర్ మీదుగా ఆశ్రమ పాఠశాల-బాబాపూర్ వరకు వెళ్తున్న ప్రధాన రోడ్డు మరమ్మతుల కోసం ఏడాది క్రితమే కంకర వేశారు. అయితే ఇప్పటికీ తారు వేయడం మరిచారు. దీంతో రోడ్డుపై పూర్తిగా రాళ్లు తేలి వచ్చి పోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేరోడ్డు మీదుగా రన్‌వెల్లి, లంబాడీహెట్టి, బూరెపల్లి, కోర్సిని తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి కంకర రోడ్డుపై బీటీ వేసి తమకు రవాణా పరంగా ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

జైనూర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబోలి గ్రామ పంచాయతీలోగల జాడుగూడకు చెందిన 7వతరగతి విద్యార్థిని ఆత్రం పార్వతి(11) బుధవారం అనారోగ్యంతో మృతి చెందిందని మృతురాలి తండ్రి ఆత్రం భీంరావ్ తెలిపింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పార్వతి రాసిమెట్ట ఆశ్రమోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. దసరాసెలవులకు ఇంటికిరాగా అనారోగ్యానికి గురైంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో చూపించినా ఆరోగ్యం బాగుపడలేదు. చివరకు ఇంట్లోనే అనారోగ్యంతో బుధవారం మృతి చెందింద న్నారు.

గుండెపోటుతో యువకుడు..

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుడగ్రామానికి చెందిన మేకర్తియుగేంధర్(39) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. యుగేందర్ రోజులాగే వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికివచ్చి భోజనం చేసి పడుకుంటుండగా ఒక్కసారిగా గుండెనొప్పి వచ్చింది. వెంటనే కుటుంబీకులు ఆయనను ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

పూలాజీబాబా బోధనలు ఆచరణీయం

- పూలాజీబాబా తనయుడు ఇంగ్లే కేశవ్‌రావ్

జైనూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పూలాజీబాబా బోధనలు ఆచరణీయమని బాబాతనయుడు కేశవ్‌రావ్ ఇంగ్లే అన్నారు. మండలంలోని పాట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్‌లో బుధవారం పూలాజీబాబా సమాధి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తదితర రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు హాజరై బాబాసమాధి మందిరంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాబా తనయుడు ఇంగ్లే కేశవ్‌రావ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ధ్యానంవల్ల తప్పక దైవశక్తి ప్రాప్తవుతుందన్నారు. ప్రతిఒక్కరూ ధ్యాన మార్గంలో పయనించాలని సూచించారు. అంతకుముందు 10నిమిషాల పాటు ధ్యానధారణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

జనసంద్రమైన పాట్నాపూర్

పూలాజీబాబాసమాధి మహోత్సవంలో భాగంగా పాట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్ వేలాదిమంది భక్తులతో జన సంద్ర మైంది. పులాజీబాబా జెండా, సమాధి మందిరంలో దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. కార్యక్రమంలో పులాజీబాబా సతీమణి ఇంగ్లే ద్రుపదబాయి, సంస్థాన్‌చైర్మన్ ఇంగ్లే కేశవ్‌రావ్, మాజీసర్పంచ్ కందారె బాలాజీ, సిద్దేశ్వర్ సంస్థాన్ వైస్ చైర్మన్ ఇంగ్లే వామన్‌రావ్, గ్రామపటేల్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పూలాజీ బాబా సమాధి మహోత్సవం

సిర్పూర్(యు), డిసంబరు 25 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని పూలాజీబాబా ధ్యాన కేంద్రంలో బుధవారం బాబా సమాది మహోత్సవంను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ధ్యాన కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం భజనలు చేశారు. కార్యక్రమంలో మాజీమార్కెట్ కమిటి చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

సిర్పూర్(టి), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల సమీపంలోని వెంకట్రావుపేట, మాకిడివద్ద రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్సై కమలాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతివాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. నాటుసారా, బెల్లం, గుడుంబా, బియ్యం, ధాన్యం తరలించకుండా చర్యలు చేపట్టాలన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

బెజ్జూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని సలుగుపల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎలాంటి పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి


బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్


ఆసిఫాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలో బీజేపీ నాయకులు మాజీప్రధాని భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో నాయకులు సతీష్ బాబు, బాలకృష్ణ, సంజీవ్, రాంబాబు, జయరాజ్, కార్తీక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం మాజీప్రధాని అటల్‌బిహారి వాజ్‌పేయి జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి ఎనలేని సేవలు చేసినట్టు పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అంతా కృషిచేద్దామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశప్రధానిగా వాజ్‌పాయి అనేక సంస్కరణలు తీసుకొచ్చి నట్టు తెలిపారు. ఆయన ఆశయ సాధనకోసం ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచికలపేట: మండలకేంద్రంలో వాజ్‌పేయి శతజయంతిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్, రాజన్న, భుజంగరావు, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

డైట్ కళాశాల ప్రారంభించాలి

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 25(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో డైట్‌కళాశాల భవనం పూర్తైనందున ఈసంవత్సరం తరగతుల ప్రారంభానికి ఉపాధ్యాయులను, ఉపాధ్యాయేతర సిబ్బందిని నియమించాలని బుధవారం డీసీసీఅధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడుసుభాష్, ఉపాధ్యాయుడు హేమంత్ సిండె తదితరులు పాల్గొన్నారు.

పూలే అంబేద్కర్ బుద్ధ భూమి కమిటీ

వాంకిడి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పూలే అంబేద్కర్ బుద్ధ భూమి కమిటిని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయ్‌ఉప్రె, ప్రధాన కార్యదర్శిగా విలాస్, కోశాధికారిగా రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా శ్యాంరావు, మొండి, శంకర్‌తోపాటు పలువురు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, జయరాం, సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి


వాంకిడిలో మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న బీఎస్ఐ నాయకులు

వాంకిడి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అంటరానితనాన్ని రూపుమాపాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్‌మహోల్కార్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని జేతావన్ బుద్ధవిహార్‌లో మనుస్మృతి దహనదివస్ సందర్భంగా మనస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 1927 డిసెంబరు 25న అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ అంబేద్కర్ అతని అనుచరులు కలిసి మనుస్మృతిని దహనం చేశారన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ నాయకులు జైరాం ఉప్రె, విజయ్, విలాస్, హిరిషన్, ప్రతాప్, వివిధ గ్రామాలకుచెందిన అంబేద్కర్‌సంఘం నాయకులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో బుధవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ప్రాణహిత నది అంబేద్కర్ విగ్రహం వద్ద మనస్మృతి ప్రతులను దహనం చేశారు. కౌటాలమండలకేంద్రంలోని బుద్ధవిహార్ నుంచి తుమ్మిడిహెట్టి వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాథ్, బండరావు, దిలీప్, ప్రకాష్, అశోక్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

రెబ్బెన, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన గోలేటి గ్రామంలో 200మంది వృద్ధులకు అనీల్ అన్న యువసైన్యం సభ్యులు బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్‌రావు మాట్లాడుతూ అనిల్ అన్న యువసైన్యం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. అనిల్ అన్న యువసైన్యం ఫౌండేషన్ చైర్మన్ జువ్వాజి అనీల్‌గౌడ్ మాట్లాడుతూ నిరూపేదలకు సేవలు అందిం చాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జైనూరు మార్కెట్‌కమిటీ చైర్మన్ విశ్వనాథ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పోశం, ఆయా మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలి

రెబ్బెన, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల27,28తేదీల్లో నిర్వహించే టోకెన్ సమ్మె ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగె ఉపేందర్ తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంటు చేసి వేత నాలు పెంచాలని, జీవోనెం.51ని సవరించి, మల్టిపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కేటగిరిల వారిగా వేతనాలను పెంచాలనే ప్రధాన డిమాండ్లతో టోకెన్ సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో జేఏసీ నాయకులు రమేష్, వెంకటేష్, దేవాజీ, ప్రవీణ్, సునీల్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో పులి భయం..


పెంచికలపేట: పెద్దవాగులో పులి అడుగులను గుర్తిస్తున్న అటవీ అధికారులు

పెంచికలపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా మండలంలో పెద్దపులి కదిలికలు కలకలం రేపుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి కొండపల్లి బీట్‌లో పులి అడుగులను అటవీఅధికారులు గుర్తించారు. అలాగే ఎర్ర గుంట శివారులోని నీటికుంట వద్ద నీటిని తాగినట్లు సోమ వారం గుర్తించారు. మంగళవారం బొంబాయిగూడ గ్రామ సమీపాన ఉచ్చమల్లవాగులో గ్రామసమీపాన పంట పొలాల్లో, కొండపల్లి బొక్కివాగు ప్రాంతంలో పులిపాద ముద్రలను స్థానికులు గుర్తించి అటవీఅధికారులకు సమాచారం అందించారు. వారు ఆ ప్రాంతానికి చేరుకుని పులి అడుగులు లేవని నిర్ధారించారు. అయితే అవి ఒక రోజు క్రితం అడుగులని తెలిపారు. గ్రామ శివారులో పులి పాదముద్రలు కల్పించడంతో ఆయాగ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో పత్తి ఏరివేతకు కూలీలు ముందుకు రావడం లేదు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

దహెగాం: మండలంలో పులి సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో సద్దాం హుస్సేన్ అన్నారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలోని పెద్ద వాగు వద్ద పులిఅడుగులు కనిపించడంతో వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద వాగు సమీపంలోని చేనులలో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం 10తరువాత వెళ్లి, సాయంత్రం 4గంటలకు ఇంటికి చేరాలన్నారు. ఆయన వెంట ఎఫ్ఎస్‌వో రవి, ఎఫ్‌బీవోలు వెంకటేష్, సురేందర్, సద్దాం తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శివరాం(ఫైల్)

తాండూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అచ్చలాపూర్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చలాపూర్ గ్రామానికిచెందిన మల్కారు శివరాం (27) అనే యువకుడు కూలీ పనులు చేస్తాడు. అదే క్రమంలో గ్రామంలో రాత్రి కూలీ పనులకు వ్యానులో పత్తి నింపుతున్నాడు. మూత్ర విసర్జనకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో శివరాంకు తీవ్ర గాయాలయ్యాయి. శివారంను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆసుపత్రికి అక్కడ నుంచి హైద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివరాం మంగళవారం రాత్రి మృతి చెందాడు. ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

గర్మిళ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఛాతి నొప్పితో మంచిర్యాలలోని జన్మభూమినగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన కొంగ శ్రీనివాస్(45) అనే వ్యక్తికి మంగళవారం రాత్రి ఛాతి నొప్పి వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో అతడిని చేర్పించారు. చికిత్స ప్రారంభించిన వైద్యులు రూ. 1.80 లక్షలు ప్యాకేజీకి అగ్రిమెంటు చేసుకున్నారు. రూ. 1.60 లక్షలు ముందస్తుగానే డిపాజిట్ చేయించుకున్నారు. కాగా డబ్బులు కట్టాక కేవలం 45 నిమిషాల్లోనే శ్రీనివాస్ చనిపోయాడని చెప్పడంతో కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. రాత్రి 7 గంటలకు మృతిచెందగా బుధవారం మృతదేహాన్ని తీసుకువెళ్లమని యాజమాన్యం చెప్పింది. ఆసుపత్రి బిల్లు రూ. 4.50 లక్షలు అయ్యిందని, మిగితా రూ. 3 లక్షలు కట్టి మృతదేహాన్ని తీసుకువెళ్లాలని చెప్పడంతో శ్రీనివాస్ కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఒక్కరోజు చికిత్స కోసం రూ. 4.50 లక్షలు ఎలా అవుతుందా అని, అంతఖరీదైన వైద్యం అందిస్తే ప్రాణాలు ఎలా పోతాయని ప్రశ్నించారు. దీంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు రూ. 30 వేలు చెల్లించడంతో మృతదేహాన్ని ఆసుపత్రి యాజమాన్యం కుటుంబీకులకు అప్పగించింది. ఈ విషయంపై ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ తాము డబ్బులు కడితేనే మృతదేహాన్ని అప్పగిస్తామని చెప్పలేదని, నాలుగు స్టంట్లు వేశామని దీని ఖర్చుకు బిల్లు కట్టామని సూచించామని పేర్కొన్నది.

గాయపడిన లేగదూడకు చికిత్స

తాండూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని నీలయపల్లెలో గాయపడ్డ లేగదూడకు పశువైద్యుడు బుధవారం చికిత్స చేశాడు. గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం లేగ దూడపై పులి దాడి చేసి గాయపర్చిందని తెలియడంతో అటవీ శాఖ అధికారులు బుధవారం లేగ దూడను పశు వైద్యుడి వద్దకు తీసుకువెళ్లారు. లేగ దూడకు వైద్యుడు చికిత్స చేశాడు. దూడపై ఊర కుక్కలు దాడి చేసినట్లు నిర్ధారించారని అటవీ శాఖ అధికారులు తెలిపారు. మండలంలో పులి సంచారం లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని అటవీ అధికారులు సూచించారు.

చోరీలకు పాల్పడిన ముగ్గురిపై కేసు

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దాడి చేసిన దొంగతనానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన పాముల పురుషోత్తంకు చెందిన కారును అద్దె నిమిత్తం మంచిర్యాలకు వెళ్లాలని ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మాట్లాకున్నారని చెప్పారు. కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాలకు బయలుదేరిన క్రమంలో బెల్లంపల్లి జాతీయ రహదారి పక్కన కారు నిలుపాలని డ్రైవర్‌కు చెప్పారు. ఈ సమయంలో డ్రైవర్‌ను కారులో నుంచి దిగాలని ముగ్గురు వ్యక్తులు చెప్పడంతో అతడి బయటకు వచ్చాడు. కారు దిగిన డ్రైవర్ పురుషోత్తంపై ముగ్గురు వ్యక్తులు తలపై, కాళ్లపై విచక్షణ రహితంగా దాడి చేశారు. తీవ్ర గాయాలైన పురుషోత్తం మృతిచెందాడని అనుకుని అతడి వద్ద ఉన్న రూ. 3,500 నగదుతో పాటు సెల్‌ఫోన్‌తో పాటు కారును సైతం తీసుకువెళ్లారు. కొంత సేపటికి పురుషోత్తంకు స్పృహ రావడంతో ఇతరుల సహాయంతో కుటుంబీకులకు సమాచారం అందించాడు. వారు చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం పురుషోత్తం కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువు భూమిని కాపాడాలి



నాగసముద్రంలో మాట్లాడుతున్న స్థానికులు

దండేపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామ సమీపంలో గల చెరువు భూమిని కబ్జాదారుల నుంచి అధికారులు కాపాడాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు. దండేపల్లి మండలం నాగసముద్రంలో చెరువు వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. నాగసముద్రంలో 15, 16, 17 సర్వేలో చెరువు విస్తీర్ణం ఫుల్‌గా ట్యాంక్ రోడ్డు వరకు ఉండేదన్నారు. మూడేళ్ల క్రితం 15, 16 సర్వే నంబరులో గల భూమిలో ఆక్రమణకు గురైందన్నారు. అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగసముద్రం గ్రామస్థులు మల్లేష్, సత్తయ్య,అంజయ్య, శ్రీనివాస్, రమేశ్, శేఖర్ పాల్గొన్నారు.

గిర్దావర్‌పై దాడికి ఖండన



మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి

గర్మిళ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కాప్రా మండలంలో గిర్దావర్‌లపై జరిగినదాడిని ఖండిస్తున్నామని టీఎన్‌జీవో జిల్లాఅధ్యక్షుడు గడియారంశ్రీహరి అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వస్థలాల రక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తున్న కాప్రా మండలగిర్దావర్‌లు రమేశ్, సాయిపైదాడి చేయడం దుర్మార్గమైన చర్యఅన్నారు. దాడిచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటిఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసువాలని విజ్ఞప్తిచేశారు.కార్యక్రమంలో రామ్మోహన్,మల్లయ్య, బాపురావు,శ్రీనివాస్,రామ్‌కుమార్,శ్రావణ్‌కుమార్,గోపాల్‌పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డౌనల్‌ఏరియాలో బుధవారం పేకాట ఆడుతున్న అయిదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బస్ డిపో ఏర్పాటయ్యేనా?

- కాగజ్‌నగర్ వాసుల కల నెరవేరేనా?
- గతంలోనే డిపోకు స్థలం కేటాయించిన ప్రభుత్వం
- పట్టించుకోని అధికారులు
- అసెంబ్లీలో లేవనెత్తిన ఎమ్మెల్యే హరీష్ బాబు
- నియోజకవర్గ ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు

కాగజ్‌నగర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసే బస్‌డిపో కోసం ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇందుకోసం పాతికేళ్ల క్రితం కాగజ్‌నగర్ బస్టాండు సమీపంలో ఐదు ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే స్థలం ఉన్నప్పటికీ బస్‌డిపో మాత్రం ఇంకా మంజూరు కాలేదు. బస్‌డిపో కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. కాగా ఈ విషయమై ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కాగజ్‌నగర్‌కు బస్‌డిపో నిర్మిస్తే ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని అసెంబ్లీలో ఈమధ్య ప్రస్తావించారు. బస్‌డిపో కోసం కొనుగోలు చేసిన ఈ స్థలం అన్యాక్రాంతమవుతోందని కూడా ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే హరీష్ బాబు బస్‌డిపోపై ప్రస్తావించడంతో ఈ ప్రాంత ప్రజలకు బస్ డిపోపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.



కాగజ్‌నగర్ బస్టాండు కోసం కేటాయించిన స్థలం

ఎన్నో యేళ్ల కల..

సిర్పూరు నియోజకవర్గంలోని ఏడు మండలాల వాసులు నిత్యం బస్సుల్లో కాగజ్‌నగర్‌కు వివిధఅవసరాల నిమిత్తం వస్తుంటారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ డిపో బస్సుల ద్వారా ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. కాగజ్‌నగర్, సిర్పూరు(టి) వరకు రైలు మార్గం ఉన్నప్పటికీ కౌటాల, పెంచికల్‌పేట, చింతలమానేపల్లి, దహెగాం,బెజ్జూరు ప్రాంతాలకు కేవలం రోడ్డుమార్గం ద్వారానే ప్రయాణించాల్సి ఉంటుంది. కాగజ్‌నగర్-బెజ్జూరు, కాగజ్‌నగర్-దహెగాం మధ్య నిత్యంరద్దీ ఉంటుంది. ఈ మార్గంలో బస్సులు నడుపుతున్నప్పటికీ రద్దీకి సరిపడా సరిపోవటం లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. కాగజ్‌నగర్‌లో బస్ డిపో ఏర్పాటు చేస్తే రద్దీ ఉన్న ప్రాంతాలను బట్టి నేరుగా కాగజ్‌నగర్ నుంచి బస్సులను నడిపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం బస్సులన్నీ కూడా ఆసిఫాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు చేరుకొని మళ్లీ కాగజ్‌నగర్ మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.



కాగజ్‌నగర్ బస్టాండు

కాగజ్‌నగర్‌లో బస్సు డిపో ఏర్పాటు చేస్తే ఈ సమస్యలు తీరుతాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వివిధ గ్రామాల నుంచి సకాలంలో బస్సులు రాకపోవటంతో ప్రత్యామ్నాయంగా ఆటోలు, జీపుల ద్వారా ప్రయాణం చేయాల్సి వస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు డిపో ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ప్రజలంతా కోరుతున్నారు.

బస్‌డిపో ఏర్పాటు చేయాలి..

-విజయ్ గరామీ, కాగజ్‌నగర్



కాగజ్‌నగర్‌లో బస్‌డిపో ఏర్పాటు చేయాలి. బస్ డిపో ఏర్పాటు చేస్తే సిర్పూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించే అవకాశం ఉంటుంది. గిరి గ్రామాలకు మరింత సౌకర్యం కలుగుతుంది. ప్రస్తుతం బస్సులన్నీ ఆసిఫాబాద్‌డిపో నుంచి రావాల్సి ఉండటంతో చాలా కష్టం అవుతోంది. అధికారులు వెంటనే స్పందించి బస్సు డిపో ఏర్పాటు చేస్తే బాగుటుంది.

గిరి గ్రామాలకు సేవలు పెరుగుతాయి..

-మాచర్ల శ్రీనివాస్, కాగజ్‌నగర్



ఆర్టీసీ డిపో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతాల్లోని గిరి గ్రామాలకు మరింత సౌకర్యం కలుగుతుంది. కాగజ్‌నగర్ నుంచే అన్ని గ్రామాలకు బస్సులు వెళ్లేందుకు మార్గం ఉంటుంది. అలాగే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు కూడా రవాణా పెంచుకోవచ్చు. తద్వారా ఆర్టీసీకి ఆదాయం కూడా పెరుగుతుంది. ఆర్టీసీకి స్థలం ఉన్నప్పటికీ కూడా డిపో ఏర్పాటు చేయటం లేదు. అధికారులు వెంటనే దీనిపై ఓ నిర్ణయం తీసుకోవాలి.

అందరికీ సౌలభ్యంగా ఉంటుంది..

-పెద్దపల్లి కిషన్ రావు, కాగజ్‌నగర్



కాగజ్‌నగర్‌లో బస్సుడిపో ఏర్పాటు చేస్తే అందరికీ సౌలభ్యంగా ఉంటుంది. సిర్పూరు నియోజకవర్గం మూల బిందువు కాగజ్‌నగర్. ఇక్కడినుంచే వ్యాపార కార్యక్రమాలు జరుగుతుంటాయి. బస్‌డిపో ఏర్పాటు చేస్తే మారుమూల ప్రాంతాలకు మరింత సౌకర్యంగా ఉంటుంది. అధికారులు వెంటనే తగిన నిర్ణయం తీసుకొని బస్సు డిపో ఏర్పాటు చేస్తే బాగుంటుంది.



ఇల్లుందా..? పత్రాలు ఉన్నాయా..?

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హుల గుర్తింపు
- యాప్‌లో సాంకేతిక సమస్యలు

వాంకిడి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను గుర్తించేందుకు జిల్లాలో సర్వే కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, అన్నిచోట్ల కలిపి సర్వేయర్లు తమ సెల్‌ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని సర్వే చేపడుతున్నారు. ప్రజాపాలనలో ఇళ్లకోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను అర్హులను గుర్తించేందుకు కుస్తీ పడుతున్నారు. ఈనెల10న సర్వే ప్రారంభం కాగా గడువులోగా పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నారు. తొలి విడతలో సొంత స్థలం ఉన్న వారికి ప్రభుత్వం రూ.5లక్షలు అందిస్తామని ప్రకటించింది. నియోజకవర్గానికి 3,500ఇళ్ల చొప్పున ఆర్థిక సాయం అందనుంది.

● దొరకని చిరునామాలు..

ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేకయాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వివరాలు నమోదు చేసే సమయంలో సర్వే యర్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులో పొందుపర్చిన చిరునామాకు వెళ్తే అందుబాటులో ఉండటం లేదు. వారు సమయానికి దొరకకపోవడం, దరఖాస్తులో పొందుపర్చిన సెల్‌ఫోన్ నంబరు పనిచేయకపోవడం కూడా సర్వే జాప్యం కావడానికి కారణాలవుతున్నాయి. మరోవైపు అధి కారులు ఈనెల 31లోపు సర్వే పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక ఇబ్బందులు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అందుబాటులో ఉండకపోవడం కారణంగా గడువులోపు సర్వే పూర్తి చేయడం సందేహంగానే ఉంది.



ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న అధికారులు

● దరఖాస్తు చేసుకున్న వారిపేర్లు గల్లంతు

ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అనేక మంది లబ్ధిదారుల పేర్లు గల్లంతయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల సర్వేకోసం ఏర్పాటు చేసి యాప్‌లో అనేక మంది లబ్ధిదారుల పేర్లు లేకపోవడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేసే సమయంలో పంచాయతీఅధికారులు దరఖాస్తులో లబ్ధిదారులు పేర్కొన్న అంశాలన్నింటినీ సక్రమంగా ఆన్‌లైన్ చేయకపోవడంవల్ల ఇందిరమ్మ ఇళ్ల కోసం ఏర్పాటు చేసిన యాప్‌లో పేర్లు లేకపోయి ఉండవచ్చని సర్వేయర్లు పేర్కొం టున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసు కునే అవకాశం తిరిగి కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

● అధికారులు విచారిస్తున్నవి..

- యాప్‌లో దరఖాస్తుదారుడు గతంలో ఇందిరమ్మ ఇంటి పథకం కింద లబ్ధి పొందారా? లేదా? అని ఆరా తీస్తున్నారు.
- ప్రస్తుతం ఇల్లు ఉందా?. ఉంటే ఇల్లు ఎలా ఉంది. పైకప్పు వివరాలు, అందులో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యుల వివరాలు, వారి వివాహ స్థితిగతులు తెలుసుకుంటున్నారు.
- సొంత స్థలం ఉంటే అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయో లేదో చూస్తున్నారు. అవి లేకుంటే ఇంటి పన్ను రసీదు, కరెంటు బిల్లు, సాదాబైనామా పత్రం ఉంటే వాటిని స్కానింగ్ చేసి యాప్‌లో పొందుపరుస్తున్నారు.
- ప్రస్తుతం ఉంటున్న ఇంటివద్ద, సొంతస్థలం వద్ద యజమానిని నిల్చోబెట్టి ఫొటో తీస్తున్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న ఎల్ఎల్‌బీ ఐదో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌వి శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. పరీక్షలు జనవరి6న ప్రారంభమై 20వతేదీవరకు కొనసాగనున్నట్లుతెలిపారు. ఈపరీక్షలు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం5గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం గొల్లగూడ గ్రామానికిచెందిన గజ్జెల మౌనిక(28) బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మౌనికను ఆమె భర్త, అత్తమామలు కొద్ది రోజులుగా అదనపుకట్నం కోసం వేధిస్తున్నారు. ఈ క్రమంలో తీవ్రమనస్తాపానికి గురైన మౌనిక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు మౌనికతండ్రి రాయమల్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

శతచండీ మహాసుదర్శన ఉత్సవాలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపేటగ్రామంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శతచండీ మహాసుదర్శన నారసింహ యాగ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజ కార్యక్రమాలను చేపట్టగా భక్తులుస్వామివారినిదర్శించుకున్నారు.



సీఎంవోఏఐ అధికారుల సమస్యలను పరిష్కరించాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తాలోని కోల్ ఇండియా బోర్డు భవన కార్యాలయంలో సీఎంవోఏఐ(అపెక్స్) సమావేశం కోల్‌ఇండియా చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్ పీఅండ్‌ఐఆర్ వినయ్ రంజన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలోక్‌లలిత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కోల్ ఇండియా చైర్మన్ దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లారు. ప్రధానంగా సీఎంవోఏఐ అధికారులు క్యాష్‌లెస్ వైద్య సదుపాయం కల్పించాలన్నారు. ఎన్‌సీ డబ్ల్యూ ఉద్యోగులకు అధికారుల మధ్య జీత భత్యాల వ్యత్యాసాన్ని సరిచేయాలని కోరారు. అంతేకాకుండా పెన్షన్ స్కీంకు డీఏ లింక్ చేసి పెన్షన్‌ను రీవైజ్ చేయాలని కోరారు.

ఎన్‌సీ డబ్ల్యూ ఉద్యోగుల పిల్లల ఉన్నత చదువులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఏ విధంగా అందిస్తున్నారో తమ పిల్లలకు కూడా అందజేయాలని కోరారు. బొగ్గు సంస్థల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న అధికారులకు చేయూతనివ్వాలని కోరారు. కొన్ని రోజులుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. సీఎంవోఏఐ అధికారుల సంఘం సీనియర్‌ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి మాట్లాడుతూ బొగ్గు సంస్థల అభివృద్ధికి సంబంధించి ఇందులో చర్చ జరిగిందని తెలిపారు. సీఎంవోఏఐ ప్రధాన డిమాండ్లను కోల్ ఇండియా చైర్మన్ ముందు ఉంచామని, వాటిపట్ల ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సమావేశంలో కోల్ ఇండియా అధికారులు సూరప్‌రెడ్డి, రవీంద్రనాథ్, నాయర్‌జీ, అజీజ్ పొన్నన్న, సీఎంవోఏఐ అపెక్స్ అధ్యక్షుడు డీఎన్‌సింగ్, సంజయ్‌సింగ్, అజిత్‌కుమార్ మిశ్రా, సాహు, శరత్ తివారీ, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



కోల్ ఇండియా చైర్మన్‌తో సీఎంవోఏఐ అధికారులు

రక్తదానం చేయాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎంవీటీసీ మేనేజర్ శంకర్ తెలిపారు. బుధవారం ఎంవీటీసీ కార్యాలయంలో రక్తదానం, తలసేమియా సికిల్‌సెల్ వ్యాధి అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రక్తహీనత, తలసేమియాతో బాధపడుతున్న వారికి రక్తం అవసరం ఉంటుందని, ఇందుకోసం ఎంవీటీసీలో 35 సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం అందించామన్నారు. ఈనెల26న ఎంవీటీసీలో రక్తదాన శిబిరం ఉంటుందని, కార్మికులు రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంవీటీసీ ట్రైనింగ్ అధికారి అశోక్‌కుమార్, హెడ్‌ఓవర్ మెన్ గురుమూర్తి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

శ్రీరాంపూర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నూతనంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా బాధ్యతలు చేపట్టిన ఎల్‌వి సూర్యనారాయణను మూడోవార్డుకు చెందిన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లామహిళా ఉపాధ్యక్షురాలు ఆడెపు శ్యామల, విజయ్‌కుమార్, చిందం మల్లేష్, రహీం, జనగాం రమేష్, రహీంపాషా, తదితరులు కలిసి మొక్కను అందించారు. తమ వార్డులో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రహదారులు నిర్మించాలని కోరారు.

కార్మికులకు సొంతింటి కోసం ఒత్తిడి తెస్తాం : సీఐటీయూ

మందమర్రిటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సొంతింటి కల కోసం ఒత్తిడి చేస్తామని సీఐటీయూ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్ వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సింగరేణి కార్మికులకు సొంతింటి కల నెరవేరుస్తామని, ఇన్‌కంటాక్స్ రద్దు చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అసెంబ్లీలో ప్రస్తావించారని తెలిపారు. సొంతింటి కోసం సింగరేణి స్థలాలను కేటాయించాలని కోరారు. సొంతింటి కల డిమాండ్ల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వడ్లకొండ ఐలయ్య, బద్రి, ఆదర్శ్, రమేష్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గుర్తింపుసంఘం మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. బుధవారం ఏరియాలోని కేకే5గనిలో కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఉత్పత్తి లక్ష్యానికి మరో మూడు నెలలు సమయం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని కార్మికులకు మెరుగైన రక్షణ పరికరాలు, పనిముట్లు అందజేయాలన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమనాథుని సుదర్శన్, సోంశెట్టి రాజేశం, కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

● భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు ● పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు



ఆసిఫాబాద్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్ధరాత్రి నుంచే క్రైస్త వులు ప్రార్థనలు చేశారు. ఉదయం వరకు కొనసాగాయి.

గర్మిళ్ల : మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడ లోని సీఎస్ఐ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్‌లు పాల్గొని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలి పారు. హమాలీవాడ సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ జరిగిన వేడుకల్లో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలోని పలు చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి చర్చిలకు క్రైస్త వులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడు కల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీ సీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంతో పాటు మండలం లోని పలు గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ పండగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం చర్చిల కు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మందమర్రిటౌన్: పట్టణంలో క్రిస్మస్ పండగను క్రైస్తవులు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీఎస్ ఐ చర్చ్, మూడవ జోన్‌లోని బేతస్త చర్చిలతో పాటు కార్మెల్ హైస్కూల్ చర్చ్ , పాల చెట్టు ఏరియా, పాత బస్టాండ్, కేకే ఓసీపీ సమీపంలోని చర్చిలకు ఉద యమే క్రైస్తవులు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా పట్టణంలోని యూత్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యం లో బుధవారం క్రిస్మస్ సందర్భంగా స్థానిక శ్రీపతి నగర్ చర్చిలో దివ్యాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.

మందమర్రిరూరల్: మండల వ్యాప్తంగా బుధ వారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వ హించుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ క్రిష్ణకాలనీలోని సీఎస్ఐ వెస్లీ చర్చి సీజోన్ పాస్టరేట్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనం గా నిర్వహించారు. సంఘ సభ్యులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పాస్టర్ కె. సురేష్ ఏసు క్రీస్తు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు వై అగస్టీన్, కె వినయ ప్రశాంత్, ఫిలెమాన్ రాజు, వైఎస్ వేద కుమారి, వై నీలావతి, జోయాజ్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని సీఎస్ఐ, ఏలీమ్, పలు అనుబంధ చర్చి మందిరాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడు కలను ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సమేతం గా చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు చోట్ల కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

నస్పూర్: నస్పూర్ పట్టణంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు చర్చిలలో ప్రార్థనలు ప్రారంభిం చారు. క్రిస్మస్ పండగను పురష్కరిం చుకుని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

జైపూర్: మండలంలోని ఇందారం, జైపూర్, కిష్టాపూర్, కుందారం, పౌనూరు గ్రామాల్లో బుధ వారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవు లు ఉదయం చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించారు.

కాసిపేట: ఏసుక్రీస్తు సందేశం ప్రపంచ శాంతికి సంకేతమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బుధవారం సోమగూడెం కల్వరీ మినిస్ట్రీస్ లో జరిగిన క్రిస్మస్ వేడుకలను పాస్టర్ ప్రవీణ్, ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ప్రారంభించారు. సంస్కృతిక కార్యక్రమాలు, క్రీస్తు జననం నాటిక ఆకట్టుకుంది. నిర్వహించారు. దేవా పూర్, మల్కేపల్లి, ధర్మారావుపేట, కొండాపూర్ యాప, కాసిపేట, ముత్యంపల్లిలో వేడుకలు నిర్వహించారు.

నెన్నెల: నెన్నెల, గొళ్లపల్లి, మైలారం, జెండావెంక టాపూర్, చిత్తాపూర్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. క్రిస్మస్ తాత ఇచ్చే బహుమతులు, క్రీస్తు జన్మిం చిన పశువులపాక, అందులో బాలయేసు, ముగ్గురు జ్ఞానుల రాకలను చాటుతూ చర్చిల్లో పశువుల పాకలను ఏర్పాటు చేశారు.

భీమారం: మండలంలో క్రిస్మస్‌వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిలను అందంగా అలంకరించారు. క్రైస్త వులు పెద్ద సంఖ్యలో ఉదయం చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు బైబిల్ సందే శాలను వినిపించారు.

జన్నారం: మండలంలోని ఎస్ఐ చర్చితో పాటు పలు చోట్ల క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

ఆసిఫాబాద్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆసి ఫాబాద్ జిల్లాకేంద్రంలో క్రిస్మస్‌వేడుకలను బుధ వారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు. కరు ణామ యుడిని స్మరిస్తూ గేయాలను ఆలపించారు. జన్కాపూర్‌లోని సెయింట్ మేరీ చర్చిలో పాస్టర్ జీవన్, దస్నాపూర్ చర్చిలో పాస్టర్ కరుణాకర్, బజార్‌వాడీ చర్చిలో పాస్టర్ సదానందం ఇతర చర్చిల్లో పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కాగజ్‌నగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాగజ్ నగర్ పట్టణంలో బుధవారం క్రిస్టియన్లు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చర్చిల్లో మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించారు. బుధవారం ఉదయం క్రిస్మస్ కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు. కార్యక్రమాల్లో ఆయా చర్చిల ఫాదర్స్, పాస్టర్లు, సంఘ సభ్యులు పాల్గొ న్నారు. కిస్మస్‌ను పురస్కరించుకొని చర్చిలకు విద్యు దీపాలంకరణ చేశారు.

చింతలమానేపల్లి/దహెగాం/సిర్పూర్(టి)/కౌటాల : మండలకేంద్రంలో, గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేకప్రార్థనలు, గేయాలను ఆలపించారు. కౌటాలమండలంలోని కౌటాల, విజయనగరం, యాపల్ గూడ గ్రామాల్లోని చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఇంట్లో స్టార్‌లైట్లు, క్రిస్మస్ గుడిసెను ఏర్పాటు చేశారు.

వాంకిడి: క్రీస్తుజన్మదినాన్ని పురస్కరించుకుని మం డలంలో క్రిస్టియన్లు క్రిస్మస్ వేడుకలను ఘనం గా జరుపుకున్నారు. వివిధ గ్రామాల చర్చిల్లో క్రిస్టియన్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రం లోని చర్చిలో పాస్టర్లు ప్రభాకర్, యేసుదాసు, కేక్‌కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు ఆరాధ నలు, పాటలు, దేవుని వ్యాఖ్యాల ఆలాప నలతో ప్రార్థన మందిరాలు మార్మోగాయి. వివిధ గ్రామాల్లోని చర్చిల్లో చేసిన అన్నదాన కార్యక్ర మంలో భక్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలకేంద్రంలో గల చర్చిల్లో బుధవారం క్రిస్టియన్‌లు క్రిస్మస్ పండుగను ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశా రు. అనంతరం ఒకరినొకరు క్రిస్మస్ పండుగ శుభా కాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ మా ర్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం ఆనంద్‌రావు, మాజీస ర్పంచ్ ఆర్క నాగోరావు, డాక్టర్ రంగస్వామి, గ్రామ స్తులు పాల్గొన్నారు.



మందమర్రి సీఎస్ఐ చర్చిలో..



దండేపల్లి ఎలీమ్ చర్చిలో బిర్ల శక్తి సిమెంట్ సంస్థ ప్రతినిధులు



క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వినోద్



వాంకిడిలో ప్రార్థన చేస్తున్న భక్తులు



కాగజ్‌నగర్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

పక్కా ప్రణాళిక

5వ పేజీ తరువాయి

కానీ ఈ విద్యాసంవత్సరం ఇంకా ఇది ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుని విద్యార్థుల సౌలభ్యం కోసం అల్పాహారం ఏర్పా టు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మంచి గ్రేడ్‌లు సాధిస్తాం..



తరగతి బోధన, ప్రత్యేక తరగతుల వల్ల సబ్జెక్టులపై మంచి పట్టు వచ్చింది. ఈ సారి వార్షిక పరీక్షల్లో మంచి గ్రేడ్‌లు సాధిస్తాం. ఒకటికి రెండు సార్లు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. స్లిప్ టెస్టు ఆధారంగా ప్రతిభను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

- సాయి వర్షిత్ , పదో తరగతి, కోటపల్లి

ఉత్తమ ఫలితాల సాధనకు..



ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ ఆదేశాలతో ముందుకు వెళ్తున్నాం. పక్కా ప్రణాళికతో వంద శాతం ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు ఉత్తమ గ్రేడ్‌లు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం.

- రాజశేఖర్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, కోటపల్లి

వంద శాతం లక్ష్యం చేరే దిశగా..



జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. పా ఠశాలల్లో ప్రత్యేక తరగతులతో పాటు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించాం. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. గత సంవత్సరం కంటే ఈ సారి మరింత ఎక్కువ ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం.

- యాదయ్య , జిల్లా విద్యాశాఖ అధికారి

యాజమాన్యం నిర్లక్ష్యం సరికాదు

- మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్



హెచ్‌ఆర్ జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ కంపెనీ ఏర్పాటులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం సరికాదని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ దేవాపూర్‌లోని సిమెంట్ కంపెనీ గేటు ఎదుట చేపట్టిన ఒక రోజు దీక్ష బుధవారం ముగిసింది. మంగళవారం ఉదయం ప్రారంభమైన దీక్షను బుధవారం ఓబీసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీల కంటేశ్వర్‌రావు రాములు నాయక్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ ఓరియంట్ సిమెంట్ కంపెనీ బిర్ల యాజమాన్యం కార్మికులకు ఇచ్చిన హామీలను , డిమాండ్‌లను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీని ఆదాని సంస్థ కొనుగోలు చేయడంతో కార్మికులు అభద్రతా భావానికి గురవుతున్నారని చెప్పారు. ఉద్యోగ భద్రత కల్పించి పూర్తిస్థాయిలో ఉద్యోగులకు భరోసా కల్పించాలని కోరారు. కంపెనీలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పించడంలో కంపెనీ విఫల మైందన్నారు. భూనిర్వాసితులకు ఉద్యోగా లు ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. భూనిర్వాసితులందరికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఓరియంట్ సిమెంట్ కంపెనీ హెచ్‌ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తట్ర భీంరావు, సార రాజయ్య, వై. శ్రీనివాస్, రొడ్డ రమేష్, సాపాట్ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడిలో రాణిస్తున్న విద్యార్థినులు

- పలుచోట్ల ప్రదర్శనలు - పలు అవార్డులు, ప్రశంసలు



కూచిపూడి నృత్యం చేస్తున్న బాలిక

బెల్లంపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంస్కృ తి, సంప్రదాయా లకు నెల వైన కూచిపూడి నృత్యంపై ఆసక్తి పెంచుకుని చిన్న నాటి నుంచే శిక్షణ పొం దుతూ ప్రతిభ కనబ రుస్తున్నారు పలువురు విద్యా ర్థులు. కూచిపూడిలో ఉత్త మ ప్రదర్శనను కనబ రుస్తూ రాష్ట్ర, జా తీయ స్థాయిలో అవార్డులు సాధి స్తూ గుర్తింపు తెచ్చుకుం టున్నారు. కూచి పూడిపై ఉన్న ఆసక్తితో వారి తల్లిదండ్రులు సైతం ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తూ వివిధ రాష్ట్రాల్లో జరిగే ప్రదర్శనలకు తీసుకువెళ్తూ ప్రోత్స హిస్తున్నారు.

ప్రతిభ చాటుతున్న అక్కాచెల్లెళ్లు



బెల్లంపల్లి పట్టణానికి చెందిన కాంపెల్లి శంకర్-రాజేశ్వరి దంపతుల కు మార్తెలు త్రవిద్య, శ్రవిద్యలు చిన్ననాటి నుంచి కూచిపూడి నాట్యంలో రాణి స్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా పట్టణంలోని నాట్య గురువు పేర్ల అర్చన జయప్రకాష్ వద్ద కూచిపూడి నృత్యం నేర్చుకుంటోంది. వివిధ రాష్ట్రా ల్లో, జిల్లాల్లో ఎన్నో ప్రదర్శనలు చేసి అవార్డులు సొంతం చేసుకున్నారు అక్కాచెల్లెల్లు. శ్రీకళావేదిక వారు నిర్వ హించిన గిన్నీస్ రికార్డు 24 గంటలు నృత్య ప్రదర్శన చేసి ప్రశంసా పత్రం అందుకున్నారు.

కూచిపూడి నాట్యంపై ఆసక్తి చూపుతున్నారు

- అర్చనజయప్రకాష్, కూచిపూడి నాట్య గురువు



కూచిపూడి నృత్యం నేర్చుకోవడానికి చిన్నవ యస్సు నుంచే బాలికలు ఆసక్తి చూపుతున్నారు. నేను 15 సంవత్సరాలుగా నాట్యం నేర్పిస్తున్నా. ఎంతో మంది విద్యార్థులు, యువతులు రాష్ట్ర, జా తీయ స్థాయిలో పలు ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు అందుకోవడం సంతోషాన్నిస్తోంది. ప్రస్తుతం చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు నాట్యం నేర్పించడంపై ఆసక్తి చూపుతున్నారు.



పోటీల్లో తలపడుతున్న జట్లు

కొనసాగుతున్న జాతీయ స్థాయి పోటీలు

బెల్లంపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిలక్ మైదానంలో జాతీయ స్థాయి సాఫ్ట్‌బేస్‌బాల్ సబ్ జూనియర్ యూత్ అండ్ గర్ల్స్ చాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం సబ్ జూనియర్ బాయ్స్‌లో కేరళ -తెలంగాణ జట్లు పోటీ పడ్డాయి. ఇందులో కేరళ జట్టు గెలుపొందింది. మహారాష్ట్ర -కర్ణాటక పోటీ పడగా మహారాష్ట్ర విజయం సాధించింది. కేరళ - మహారాష్ట్ర పోటీ పడగా కేరళ గెలుపొందింది. కేరళ- కర్ణాటక పోటీ పడగా కేరళ గెలిచింది. సబ్ జూనియర్ గర్ల్స్ విభాగంలో కేరళ -మధ్యప్రదేశ్ పోటీ పడ్డాయి. కేరళ గెలిచింది. బాలుర యూత్ విభాగంలో కేరళ-మధ్యప్రదేశ్ పోటీ పడగా కేరళ గెలుపొందింది. తెలం గాణ-మధ్యప్రదేశ్ పోటీ పడగా తెలంగాణ గెలిచింది. యూత్ బాలికల విభాగంలో కేరళ -మధ్యప్రదేశ్ పోటీ పడగా కేరళ గెలిచింది. సబ్ జూనియర్ బాయ్స్ విభాగంలో కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. సబ్ జూనియర్ గర్ల్స్ విభాగంలో కేరళ, మధ్యప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. యూత్ బాలుర విభాగంలో కేరళ, హరి యాణా, తెలంగాణ , మధ్యప్రదేశ్, యూత్ మహిళా విభాగంలో కేరళ, మధ్య ప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్ జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నట్లు రాష్ట్ర సాఫ్ట్‌బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. ఈ క్రీడా పోటీలను బెల్లంపల్లి కోర్టు జడ్జి ముకేష్ వీక్షించి క్రీడాకారులతో మాట్లాడారు. కార్యక్రమంలో పీఈటీ రాజ్‌మహ్మద్, నిర్వాహకుడుబలరాం తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం

● ఆసక్తి చూపుతున్న రైతులు ● కోళ్ల ఫారం నిర్మాణానికి ఈజీఎస్ చేయూత

కాసిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల పెంపకం సర్వసాధారణం. నేడు గ్రామీణ ప్రాంతాల్లో సైతం పెరటి (నాటు) కోళ్ల పెంపకం కనుమరుగైంది. పల్లెల్లో వాటి స్థానాలను బాయిలర్, లేయర్ కోళ్ల దుకాణాలతో భర్తీ చేశారు. పండగలకు, ఇతర వేడుకలకే కాకుండా ఇంటికి చుట్టాలు వచ్చినా, ఆదివారాల్లో ఇండ్లలో మాంసాహారం వంటల ప్రాధాన్యం పెరిగిపోయింది. మాంసం ప్రియులకు పోషక విలువలతో కూడిన మాంసాహారం అందిం చేందుకు పెరటి కోళ్ల పెంపకం అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం పల్లెల్లో నాటుకోళ్ల ఫారాలు దర్శనమిస్తున్నాయి. మహిళ లను ఆర్థికంగా ప్రోత్సహిం చేందుకు ఐకేపీ (ఇందిరా క్రాంతి పథకం) ద్వారా రుణాలు అందిస్తుండగా ఎన్ఆర్ఈజీఎస్ నుంచి ఉచితంగా ఫారం నిర్వహ ణకు షెడ్లను నిర్మించి ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. పెరటి కోళ్ల పెంపకంలో శ్రమ ఎక్కువ ఉన్నా నష్టాలు రావడం లేదని నిర్వాహకులు అంటున్నారు.

● యువతకు ఉపాధి

యువత ఇలాంటి స్వయం ఉపాధి పథకాలను ఎంచుకుంటు న్నారు. ప్రత్యా మ్నాయ ఉపాధి రంగా ల్లో కృషి చేస్తే ఆర్థికంగా ఎదగవచ్చు. పెరటి కోళ్ల పెంపకం లాభ దాయకంగా ఉంది. కోడి మాంసంతో పాటు గుడ్లను విక్రయిస్తే ఆర్థికంగా అదనపు లాభం పొంద వచ్చు. రైతులు,యువకులు కోళ్ల పెంపకం చేపడుతున్నారు.



కోమటిచేనులో నిర్వహిస్తున్న పెరటి కోళ్ల ఫారం

మదర్‌యూనిట్‌ల నిర్మాణానికి ఆర్థికసాయం

- నవీన్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో

పెరటి కోళ్ల పెంపకం చేపట్టే వారికి ఉపాధిహామీ ద్వారా మదర్ యూనిట్‌ల నిర్మాణానికి రూ.2 లక్షలకు పైగా ఆర్థిక సహాయం అందిస్తాం. మదర్ యూనిట్‌లో వెయ్యి కోడి పిల్లలు ఉండాలి. వంద కోడి పిల్లలు ఉన్న యూనిట్‌కు షెడ్డు నిర్మించేందుకు రూ.55 వేల ఆర్థిక సహాయం అందిస్తాం. తెల్ల రేషన్ కార్డుతో పాటు ఎన్ఆర్ఈజీఎస్‌లో జాబ్ కార్డు కలిగి ఉండాలి. పెరటి కోళ్ల పెంపకంను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి.

పెరటి కోళ్ల పెంపకం సంతృప్తినిస్తోంది

- జాడి పద్మ, కోమటిచేను




వ్యవసాయంతోపాటు ఏడాది క్రితం పెరటి కోళ్ల పెంపకం నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా మదర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాం. లాభదాయకంగా కోళ్ల పెంపకం సాగుతోంది. కోళ్ల పెంపకానికి డబ్బులు లేకపోవడంతో మహిళ సంఘంలో రూ.2 లక్షల రుణం తీసుకుని 2 వేల కోడి పిల్లలతో ప్రారంభించాం. అవి పెరిగి పెద్దవై లాభసాటిగా ఉంది. యూనిట్‌ను మరింత విస్తరించేందుకు కుటుంబంలో అందరం కష్టపడుతున్నాం. లాభాలతో పాటు వీటి సంరక్షణలో కష్టాలు కూడా ఎక్కువగా ఉంటాయి. పాములు, ముంగిసలు, పిల్లుల బారి నుంచి కోడి పిల్లలను కాపాడుకోవాలి. వేసవిలో వ్యాధులు సోకకుండ జాగ్రత్తలు తీసుకుంటే వ్యాపారం లాభసాటిగా ఉంటుంది.

ప్రతి ఇంటిలో పెరటి కోళ్ల పెంపకం యూనిట్‌లను ఏర్పాటు చేసుకోవాలి.

- వెంకటేష్, ఐకేపీ ఏపీఎం



మహిళలు ఆర్థికంగా లాభపడినప్పుడే కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుంది. అలాగే తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేందుకు వీలవుతుంది. గ్రామైక్య సంఘం ద్వారా ప్రతీ మహిళ సభ్యురాలు పెరటి కోళ్లపెంపకం యూనిట్‌లను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సంఘాల నుంచి రుణాలను అందజేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. కోడి పిల్లలను సంరక్షించుకుంటే ఆర్థికంగా లాభపడవచ్చు.



భక్తి శ్రద్ధలతో క్రిస్మస్

మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో బుధవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. హాపీ క్రిస్మస్, మేరీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాస్టర్లు చర్చిల్లో ప్రార్థనలు చేయించి సందేశమిచ్చారు. క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని, యేసు లోకంలో జన్మించి శాంతి, సమాధానంతో, ప్రేమతో వ్యక్తి మెలగే రీతిని తన జీవితం ద్వారా తెలిపారని సూచించారు.

7



చెన్నూరు మండలం కిష్టంపేటలోని ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



చీర చుట్టుకొన్న నారుమడి

యాసంగి వరి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. నారు మడిని కాపాడుకునేందుకు రైతులు పలు ప్రయోగాలు చేస్తున్నారు. పందులు, పశువులు, పక్షులు ఇతర జంతువుల నుంచి కాపాడుకునేందుకు వరి నారు మడుల చుట్టు రంగు రంగుల చీరలను కట్టి రక్షించుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు నారుమడి చుట్టూ రంగు రంగుల చీరలు కట్టి నారుమడిని కాపాడుకుంటున్నారు.

- దండేపల్లి, ఆంధ్రజ్యోతి



పెరటి కోళ్ల పెంపకం

లాభదాయకం

- ఆసక్తి చూపుతున్న రైతులు
- కోళ్ల ఫారం నిర్మాణానికి ఈజీఎస్ చేయూత

7



ఇల్లుందా.. పత్రాలు ఉన్నాయా..?

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హుల గుర్తింపు
- యాప్‌లో సాంకేతిక సమస్యలు


6

క్రీడాకారులు రిపోర్టు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్‌లో భాగంగా రాష్ట్రస్థా యిలో జరగనున్న క్రీడా పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రిపోర్టు చేయాలని జిల్లా యువజన క్రీడ అధికారి కీర్తిరాజ్‌వీరు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో రిపోర్టు చేయాలని తెలిపారు. వివరాల కోసం 9963539234లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పక్కా ప్రణాళిక

పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి ప్రత్యేక శ్రద్ధతో వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో మెలకువలు చెబుతున్నారు.



- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- వందశాతం ఉత్తీర్ణత వైపు అడుగులు
- మెరుగైన ఫలితాల సాధనకు కృషి

కోటపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ మార్కులు సాధించేందుకు విద్యాశాఖ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. మెరుగైన ఫలితాలు రాబట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసి పాఠ్యాంశాల వారీగా అమలు చేస్తున్నారు. మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో నెల రోజుల క్రితం నుంచే ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం ఒక్కో సబ్జెక్టు టీచర్లు విద్యార్థులను గ్రూపుల వారీగా విభజించి పాఠ్యాంశాలను పునశ్చరణ చేయిస్తున్నారు.

గతంలో నిర్వహించిన వార్షిక పరీక్షల ఆధారంగా పాత ప్రశ్న పత్రాలతో పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర మూల్యాంకనం చేస్తున్నారు. స్టడీ అవర్ నిర్వహిస్తున్న సమయంలో వారికి వచ్చిన సందేహాలను నివృత్తి చేయడంతో పాటు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఏ సబ్జెక్టులో వెనకబడి ఉన్నారో గుర్తిస్తూ ఆయా విభాగాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఉత్తీర్ణత శాతం పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు కొన సాగుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆదర్శ , కేజీబీవీ, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. జిల్లాలోని 135 పాఠశాలల్లో 6,208 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరికి ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. రోజు కు ఒక సబ్జెక్టు చొప్పున నిర్వహిస్తూ నిర్ణీత సమయంలో తరగతుల నిర్వహణపై శ్రద్ధ వహిస్తున్నారు. అంతే కాకుండా రోజు వారీగా తరగతుల రికార్డుల నిర్వహణ ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఈ నెల 10 వరకు సిలబస్ పూర్తి చేయనుండగా ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులను పాఠశాల వెలుపల మాత్రమే కూర్చో బెట్టాలనే ఆదేశాలతో ఆరుబయటే స్టడీ అవర్‌లు కొనసాగుతున్నాయి.

పరీక్షలంటే భయం పోయింది..

అంజలిదేవి, పదో తరగతి, కోటపల్లి



గతంలో పరీక్షలంటే భయం ఉండేది. ప్రత్యేక తరగతుల వల్ల భయం తొలగిపోయింది. ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం తది తర విభాగాలపై ఉపాధ్యాయులు మాసం దేహాలను నివృత్తి చేస్తున్నారు. ఆంగ్లంలో వ్యాకరణము, సామన్య శాస్త్రంలో చిత్రపటాలు, గణితంలో సూత్రాలపై పట్టు సాధించి వార్షిక పరీక్షల నాటికి పూర్తిగా సన్నద్ధమవుతాం.

మెరుగైన ఫలితాల కోసం..

పదో తరగతిలో 2023-24 విద్యా సంవత్సరం కంటే మెరుగైన ఫలితాల సాధనకు విద్యాశాఖ దృష్టి సారించింది. గత సంవత్సరం రాష్ట్ర స్థాయిలో జిల్లా 20వ స్థానంలో నిలిచింది. జిల్లాలో గత సంవత్సరం 9,283 మంది విద్యార్థులకు గాను 8,579 మంది విద్యా ర్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ప్రభుత్వ పాఠశా లలు 42, ప్రైవేటు పాఠశాలలు 29 వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం 188 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 28 మంది మాత్రమే ఉండడం గమనార్హం. కాగా ఈ సారి ఈ సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖ కసరత్తులు చేస్తోంది. జిల్లాలోని మోడల్ స్కూల్, కళాశాలల్లో పదో తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులకు సైతం రెండు పూటలా ప్రత్యేక తరగతులు కొన సాగుతున్నాయి.

అల్పాహారం కోసం..

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగుతుండగా ఉదయం విద్యార్థులు హడావుడిగా ఏం తినకుండా వస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో ఆకలి తీర్చుకుంటుండగా సాయంత్రం అల్పాహారం అందించకపోవడంతో ప్రత్యేక తరగతుల వేళ విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. గత ఏడాది పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ స్నాక్స్ అందించారు. మిగతా 7వ పేజీలో

కొనసాగుతున్న ఎస్‌ఎస్‌ఏల సమ్మె



శిబిరంలో కూర్చున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాము 16 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరారు. శిబిరాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ, న్యాయవాది రంగు వేణు, సల్లా వుద్దిన్ సందర్శించి మద్దతు పలికారు.

సేవలతోనే గుర్తింపు

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు

దండేపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్ల రావు అన్నారు. దండేపల్లిలో బుధవారం లయన్స్ క్లబ్ భవన నిర్మాణానికి మండల లయన్స్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం మండలం లోని కర్ణపేటలో నాయకపుగూడలో ఆదివాసీ గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మ్యాదరిపేటలో ఓ పంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ సేవ అనేది గొప్ప వర మన్నారు. అందుకే మనం సమాజ సేవకు లయన్స్ క్లబ్ సభ్యులు అంకితమై సేవా కార్యక్రమాలల్లో ముందు ఉండాలన్నారు. పేదలకు వైద్య శిబిరాలు, చదువుల కోసం సాయం తదితర సేవలను అందించడంలో లయన్స్ క్లబ్ ముందుండాలన్నారు. కార్యక్రమంలో డీసీఎస్ శ్రీనివాస్‌రావు, జోనల్ ఛైర్‌పర్సన్ అంజిత్‌రావు, రీజనల్ సెక్రెటరీ అనుముల రాజన్న, జోనల్ ట్రెజరర్ జక్కుల భూమేష్, దండేపల్లి మండల లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాదంశెట్టి మల్లికార్జున్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డిస్టిక్ 230జీ రీజియన్ 3వ జోన్ 1వ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. పైడిపల్లి గ్రామంలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. జన్నారం బస్టాండ్‌లో తల్లిపాలిచ్చే మదర్ ఫీడింగ్ రూమ్‌ను ఓపెన్ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఛైర్మన్ జగదీష్, ఛైర్మన్ జక్కు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల చిరుజల్లులు

- అన్నదాతల ఆందోళన



ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

చెన్నూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో వాయు గుండం ఏర్పడ డంతో మండలంలోని లింగంపల్లి, కిష్టం పేట, నాగాపూర్, అస్నాద, కాచన్‌పల్లి గ్రా మాల్లో బుధవారం ఆకాశం మేఘామృతమై చిరుజల్లులు పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆర బోసిన ధాన్యం తడిసి పోకుండా రైతులు కవర్లు కప్పారు. భారీ వర్షం వస్తే ధాన్యం తడిసిపోయిందని చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోటపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్గామ, దేవులవాడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని తెలిపారు.

30లోగా దరఖాస్తు చేసుకోవాలి

దండేపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రత్యేక ప్రవేశాలకు తాత్కల్ ఫీజు చెల్లింపు ద్వారా ఈనెల 30లోగా అభ్యాసకులు దరఖాస్తు చేసుకోవాలని దండేపల్లి ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నరేందుల శ్రీనివాస్, సహాయ కో ఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఓపెన్ స్కూల్ చేరేందుకు అభ్యాసకులకు చివరి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 830979067 నంబరులో సంప్రదించాలని సూచించారు.

టీపీటీఎఫ్ జిల్లా కమిటీ

గర్మిళ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని మార్క్స్ భవన్‌లో తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని బుధవారం రెడ్డిమల్ల ప్రకాశం అధ్యక్షతన నిర్వహించారు. అధ్యక్షుడిగా పాడేటి సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా బుక్య మనోజ్, ఉపాధ్యక్షులుగా గాజుల శంకర్, వెంకటరాజమ్మ, పెద్ది లక్ష్మణ్, కార్యదర్శులుగా వెంకటస్వామి, స్వర్ణలత, ప్రవీణ్, సమ్మయ్య, కమల్ హాసన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఆయన శత జయంతి ఉత్సవాల ముగింపును మంచిర్యాలలోని శివాజీ మైదానంలో నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన జీవిత చరిత్రపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాజపేయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ, దేశ రాజకీయ చరిత్రలో అన్ని రాజకీయ పార్టీల నాయకులకు విలువలు నేర్పిన నాయకుడు వేజ్‌పేయి అని కొనియాడారు. పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజనీష్ జైన్, దుర్గం అశోక్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, తుల ఆంజనేయులు, రాకేష్ రేణ్వా, రెడ్డిమల్ల అశోక్, బోయిని హరికృష్ణ, సత్రం అశోక్, అమిరిశెట్టి రాజు, పల్లి రాకేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా మంచిర్యాల కాలేజీ రోడ్డులో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల అశోక్‌వర్ధన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్న రాజా సిసోడియా, తులా మధుసూదన్ రావు, తిరు పతిరెడ్డి, బుద్ధారపు రాజ మౌళి, కాశెట్టి నాగేశ్వర రావు, విజయ్, యాదగిరి, శ్రీనివాస్, సాయికృష్ణ, అనిల్, బండారు శ్రీనివాస్, అశోక్, పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను పురస్కరించుకుని బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలు లర్పించారు. దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మందమర్రిటౌన్: పట్టణంలో వాజ్‌పేయి శత జయంతి వేడుకలను బీజేపీ,దాని అనుబంధ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమారస్వామి, రాజేందర్, శివ, దుర్గరాజ్, రాజు, రాజేంద్ర ప్రసాద్, మొగిలి, అంజయ్య, మల్లేష్, రాములు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలో వాజ్ పేయి జయంతి వేడుకలను బీజేపీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు డీవీ దీక్షితులు, దేవరనేని సంజీవరావు, నాయకులు జనార్దన్, వంజరి వెంకటేష్, కర్రె రాజయ్య, దుర్గం మల్లేష్, ఎనగందుల రాజయ్య, మారుతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జన్నారం:జన్నారంలో వాజ్‌పేయి జయంతిని హమాలీ సంఘం నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గోలి చందు తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరులో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అసంపూర్తిగా పనులు



నిలిచిపోయిన ఐకేపీ కమ్యూనిటీ భవనం పనులు

దండేపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంలో ఐకేపీ కమ్యూనిటీ హాల్ భవనం పనులు నిధులు రాక అసంపూర్తిగా మిగిలిపోయాయి. దండేపల్లిలో పోలీసు స్టేషన్ సహకార సంఘం ప్రధాన కార్యలయం పక్క గల ఐకేపీ కమ్యూనిటి భవనం కోసం ఆరేళ్ల క్రితం రూ. 32లక్ష నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. ఓపెన్ స్లాబ్ వరకు నిర్మాణ పనులను సంబంధిత కాంట్రాక్టర్లు పూర్తి చేశారు. మిగతా పనులు చేపట్టేందుకు నిధులు కొరత ఏర్పడడంతో నిలిచిపోయాయి.